సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 28। ఏప్రిల్। 2025



సోమశిలలో 51.301 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 51.301 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,005
3 శాతం జీఎస్టీతో	రూ.9,275
నవర (8 గ్రా)	రూ.74,200

గరిష్టం/కనిష్టం
37.5 /27.6

వాతావరణం

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు కొన సాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 59 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజేశ్వరి

నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ జి.రాజేశ్వరిని ప్రభుత్వం నియమించింది. ఆమె ఇప్పటి వరకు రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలలో బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమెను పదోన్నతిపై ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజమన్నార్ ఈ నెలాఖరున రిటైర్ కాబోతున్నారు. దీంతో ప్రభుత్వం ఆమెను ఇక్కడ నియమించింది.

పేదరికం లేని సమాజానికి కృషి

- కలెక్టర్ ఆనంద్



కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శి బంగారు కుటుంబం పథకంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఆదివారం ఆయన వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు ఒక లక్ష కుటుంబాలు పీ4లో సహాయం అవసరం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, సేవాభావం కలిగిన వారు ఈ పథకంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావచ్చునని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రతిశాఖ కనీసం 10 మందిని మార్గదర్శి బంగారు కుటుంబం పథకంలో పేదవారికి సహకారం అందించే విధంగా భాగస్వాములయ్యేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఎవరిని బలవంతంగా ఈ పథకంలో చేర్చవద్దని, ఇది కేవలం స్వచ్ఛంద పథకమేనని తెలిపారు. పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి ఆ కుటుంబాలను దత్తత తీసుకోవడం, వారికి మార్గదర్శకులుగా ఆర్థిక సహకారం అందించడం, సంపద, ఆరోగ్యం సృష్టించడం ద్వారా సంతోష ఆంధ్రప్రదేశ్ చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత అరెస్ట్

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత అరెస్టుతో కూటమి అరాచకం పరాకాష్టకు చేరింది. శనివారం రాత్రి పిచ్చాపాటి కబుర్లల్లో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశాడని ఆదివారం ఉదయమే అరెస్ట్ చేసి అత్యవసరంగా కోర్టుకు హాజరుపరిచారు. పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత షేక్ రహీం త్వరలో ఏర్పాటు కానున్న దర్గా కమిటీపై శనివారం రాత్రి పిచ్చాపాటిగా కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. అయితే దాన్ని కొందరు వీడియోలో చిత్రీకరించి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఐ జి గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీ హడావుడిగా రంగంలోకి దిగి ఆదివారం ఉదయం రహీంను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచగా, అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు చిన్నపాటి వ్యాఖ్యానాలను పరిగణనలోకి తీసుకుని, కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందని మండి పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాక్ స్వాతంత్ర్య హక్కు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ అధినేతను, నాయకులను అసభ్యకరంగా దూషించినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

ఆడిటర్ ఆత్మహత్య

నెల్లూరు (క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆడిటర్ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. వసంతోపు మూడో వీధిలో ఆడిటర్ గిరిబాబు (40), భవాని దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. ఆయన శనివారం రాత్రి కుటుంబంతో కలిసి కొద్దిసేపు గడిపారు. అనంతరం పడక గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. గమనించిన భార్య గిరిబాబును హుటాహుటిన మాగుంట లేఅవుట్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న వేదాయపాళెం ఎస్ఐ విజయకుమార్ హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి సోదరుడు సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్ఐ కేసు నమోదు చేశారు. అనారోగ్య కారణాల నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు సూసైడ్ లేఖ రాసినట్లు తెలిసింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వారు, వీరూ ఒక్కటయ్యారు



కంచే చేను మేసిన చందంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు మాఫియా చేతిలో కీలు బొమ్మలుగా మారారు. పక్కా సమాచారంతో రేషన్ బియ్యం పట్టించినా అవి సాధారణ బియ్యంగా తేల్చి లారీలను ఏకంగా నిబంధనలకు విరుద్ధంగా డీటీలే రిలీజ్ చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో రేషన్ షాపులకు చేరాల్సిన బియ్యం అడ్డదారిలో తరలిపోతున్నాయి.

- అక్రమ రవాణా సమాచారం ఇచ్చి వాహనం పట్టించినా వదిలేస్తున్న వైనం
- ఇటీవల కోవూరు, దగదర్తిల్లో రేషన్ బియ్యం వాహనాల పట్టివేత
- వాటిల్లో సాధారణ బియ్యమేనని నివేదిక ఇచ్చిన అధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా సీజ్ చేసిన వాహనాలకు డీటీల రిలీజింగ్ ఆర్డర్

నెల్లూరు (పొగతోట): జిల్లా నుంచి ప్రతి నెల వేల టన్నుల రేషన్ బియ్యం కృష్ణపట్నం, చెన్నై పోర్టు ద్వారా విదేశాలకు తరలిపోతోంది. ఇది.. జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ, రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ శాఖలు కాదనలేని నిజం. రేషన్ షాపులకు చేరాల్సిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా రైస్‌మిల్లులకు వెళ్లి అక్కడ పాలిష్ పట్టించి, బ్రాండెడ్ బ్యాగ్‌ల్లో ప్యాక్ చేసి అక్రమ రవాణా సాగిస్తున్న విషయం జగద్విదితమే. కానీ.. మాఫియా ముడుపులకు అలవాటుపడి.. పేదల కడుపులు కొట్టి సాగిస్తున్న రేషన్ బియ్యం అక్రమ దందాతో పేదలకు పట్టెడన్నం కూడా దొరకని దుస్థితి.

పంచనామా ప్రక్రియకు పాతర

సాధారణంగా రేషన్ బియ్యం పట్టుబడిన సందర్భంలో సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు ఆరుగురు సామాన్య పౌరుల సమక్షంలో పంచనామా నిర్వహించి, శాంపిల్స్ సేకరించాల్సి ఉంది. వాటిని సివిల్ సప్లయిస్ సంస్థ టెక్నికల్ ల్యాబ్ టెస్టింగ్‌కు పంపించాల్సి ఉంది. అయితే తొలి పంచనామా ప్రక్రియకు నీళ్లొదిలేసి, తమకు తామే సూపర్ బాస్‌ల్లా డీటీలు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం వాహనాన్ని సీజ్ చేసే అధికారం డీటీలకు ఉంది. అవి పీడీఎస్ బియ్యమైనా, నాణ్యమైన బియ్యమైనా పట్టుకున్న వెంటనే కేసు నమోదు చేయాలి. పంచనామా చేసి అధికారులకు శాంపిల్స్ పంపించాలి. అయితే అధికార పార్టీ నేతలు, మాఫియా ఒత్తిళ్లకు, ముడుపులకు లొంగిపోయి క్షణాల్లో నివేదికలను ఇచ్చేస్తున్న



ఇటీవల కోవూరులో పట్టుకున్న బియ్యం లారీ

పరిస్థితి ఉందంటే ఏం జరుగుతుందో అర్థమవుతోంది.

జాయింట్ కలెక్టర్ అనుమతి లేకుండానే..

నిబంధనల ప్రకారం వాహనాన్ని పట్టుకున్న వెంటనే 6ఏ కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాల్సి ఉంది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పంపాల్సి ఉంది. పంచనామా, టెక్నికల్ రిపోర్టులను పరిశీలించాక జేసీ ఆదేశాల మేరకు వాహనాలను రిలీజ్ చేయాల్సి ఉంటుంది. అయితే దగదర్తి, కోవూరు మండలాల్లో పట్టుకున్న వాహనాలను జాయింట్ కలెక్టర్ దృష్టికే తీసుకెళ్లకుండా, ఎటువంటి ఫైల్ నిర్వహించకుండా సీఎస్‌డీటీలే అంతా తామై వ్యవహరించి లారీలను రిలీజ్ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు విధి విధానాలను పాటించకుండా మాఫియాకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ అధికారులు మాత్రం రిలీజింగ్ ఆర్డర్ సీఎస్‌డీటీకి ఉందంటూ సమర్థించుకుంటున్నారు. కోవూరుకు సంబంధించి ఎటువంటి డ్యూప్రొసీజర్స్ (గడువు ప్రక్రియలు) ఫాలో కాకుండా, పోలీస్ ఫిర్యాదు లేకుండా లారీని, బియ్యాన్ని సీజ్ చేయకుండా పోలీసు కస్టడీలో ఉంచడం, జిల్లా అధికారులకు ఎటువంటి ఆదేశాలు లేకుండా రెండు రోజులు గడిచిన తర్వాత లారీని విడిచి పెట్టడం అనుమానాలకు తావిస్తోంది.

పక్కాగా పీడీఎస్ బియ్యం పట్టించినా..

జిల్లాలో ఇటీవల రెండు ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారంటూ సివిల్ సప్లయిస్ శాఖ అధికారులకు పక్కాగా సమాచారం అందింది. సివిల్ సప్లయిస్, డిప్యూటీ తహసీల్దార్లు (సీఎస్‌డీటీలు) ఆ వాహనాలను పట్టుకుని నిబంధనలు పాటించకుండా సాధారణ బియ్యంగా చెప్పి వాటిని రిలీజ్ చేశారు. గత నెలలో దగదర్తి మండలంలో 400 బస్తాల లారీ పట్టుకుని రేషన్ బియ్యంగా అనుమానం ఉందంటూ శాంపిల్స్ సేకరించారు. కొద్ది సేపటికే అవి సాధారణ బియ్యమని అక్కడికక్కడే సర్టిఫికెట్ ఇచ్చి వాహనాన్ని వదిలేశారు. ప్రకాశం జిల్లా నుంచి వారం రోజుల క్రితం 600 బస్తాల పీడీఎస్ రైస్‌తో బయలుదేరిన లారీ వివరాలను పక్కా సమాచారంతో సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారులు వాహనాన్ని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పట్టుకోండి, అక్కడ పోలీసులు కూడా ఉంటారని డీటీలకు సమాచారం ఇచ్చారు. అయితే డీటీలు ఆ లారీని కోవూరు వద్దనే పట్టుకున్నారు. నిబంధనల ప్రకారం పట్టుకున్న వాహనానికి పంచనామా నిర్వహించకుండా, ఎటువంటి కేసు పెట్టకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ సంస్థ టెక్నికల్ అధికారులకు శాంపిల్స్ పంపించారు. గంటల వ్యవధిలోనే సదరు టెక్నికల్ అధికారులు అవి సాధారణ బియ్యంగా నిర్ధారించి నివేదిక ఇవ్వడం, వదిలేయడం చకచకా జరిగిపోయాయి.

నిబంధనల ప్రకారమే లారీని రిలీజ్ చేశా

పీడీఎస్ లారీ వస్తుందన్న సమాచారం మేరకు సీఎస్‌డీటీలను పంపించాం. వాహనాన్ని కోవూరు వద్ద పట్టుకున్నారు. తనిఖీ చేసి పంచనామా నిర్వహించి అనుమానం మేరకే సేకరించిన బియ్యాన్ని టెస్టింగ్ నిమిత్తం పంపించాం. సాధారణ బియ్యంగా నివేదికలు వచ్చిన అనంతరం లారీని సీఎస్‌డీటీ రిలీజ్ చేశారు. సాధారణ బియ్యంగా నిర్ధారణ అయిన అనంతరమే లారీని రిలీజ్ చేశాం. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నాం.

– విజయ్‌కుమార్, డీఎస్‌ఓ

జనసేన మండల కన్వీనర్‌కు రిమాండ్

కలిగిరి: జనసేన పార్టీ మండల కన్వీనర్ బండారు లక్ష్మీనారాయణను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి అత్యవసరంగా కావలి కోర్టు న్యాయమూర్తి నివాసంలో హాజరు పరిచారు. లక్ష్మీనారాయణకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో కావలి సబ్ జైలుకు తరలించారు. మండలంలోని జిర్రావారిపాళెంకు చెందిన తండ్రీ కొడుకులు మలిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చంద్రారెడ్డిలపై శుక్రవారం రాత్రి అకారణంగా లక్ష్మీనారాయణ దాడి చేసి గాయపరిచాడు. అదే రోజు లక్ష్మీనారాయణ తన తల్లి వనమ్మపై దాడి చేశాడు. ఈ ఘటనల అనంతరం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో నిందితుడిపై రెండు కేసులు నమోదు చేశారు. ఎస్సై ఉమాశంకర్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ తన తల్లి వనమ్మపై దాడి చేయడంతో అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు మొదట ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. తండ్రీకొడుకులపై దాడి కేసు పెండింగ్‌లో ఉందని, రిమాండ్ నుంచి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.



వేణుగోపాలస్వామి దేవస్థానం

దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల దేవదేవేరుల ఉత్సవాలకు ఆటంకం ఏర్పడుతోంది. దాదాపు పన్నెండు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవ వైభవం మసకబారుతోంది. పదహారు వందల ఎకరాల మాన్యం ఉన్నా.. స్వామి వారి బ్రహ్మోత్సవం కళ తప్పుతోంది. దశాబ్దాలుగా కనుల పండువగా నిర్వహించే రథోత్సవానికి అధికారులు ఈ ఏడాది బ్రేక్ వేశారు.



శిథిలావస్థకు చేరిన రథం

వేణుగోపాలా... మన్నించవా

రథం మరమ్మతుల్లో దేవదాయ శాఖ నిర్లక్ష్యం

- ఈ ఏడాది రథోత్సవం లేనట్టే
- 1,600 ఎకరాల మాన్యం.. రూ.లక్షల్లో నిధులు ఉన్నా..
- రూ.80 లక్షలు మంజూరైనా పట్టించుకోని వైనం

ఉలవపాడు: ఉలవపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది మే నెలలో తిరునాళ్ల, బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతున్నాయి. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో రథోత్సవం కీలకమైంది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భారీగా భక్తులు ఈ రథోత్సవానికి వచ్చి తిలకిస్తారు. దాదాపు 118 ఏళ్ల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించారు. 1907లో నిర్మాణం చేసిన ఈ ఆలయ నిర్వహణకు దేవరపల్లి కోటమ్మ అనే మహిళ సుమారు 1600 ఎకరాల భూమిని అప్పగించారు. ఆ తర్వాత దేవదాయశాఖ ఆధ్వర్యంలో గుడి నిర్వహణ జరుగుతోంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దాదాపు 118 ఏళ్ల నుంచి నిర్విఘ్నంగా జరుగుతున్న రథోత్సవాన్ని ఈ ఏడాది నిలుపుదల చేయనున్నట్లు అధికారులు చెప్పడంతో గ్రామస్తులకు ఇబ్బంది కరంగా మారింది. గ్రామానికి ఉన్న సెంటిమెంట్‌తో దేవదాయశాఖ ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కారణాలివీ..

దేవదాయశాఖ ఆధ్వర్యంలో మే 7 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా 14వ తేదీ రథోత్సవం నిర్వహించాలి. దేవదాయశాఖ సాంకేతిక నిపుణులు ఈ రథం 100 ఏళ్లు పైబడిందని, ఈ రథాన్ని తిప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గతేడాది తేల్చారు. ఆ తర్వాత అధికారులు కొత్త రథం అవసరమని, దీని కోసం రూ.80 లక్షల నిధులు కేటాయించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన ఇంజినీర్లు వచ్చి పాత రథాన్ని పరిశీలించి ఈ ఏడాది రథోత్సవానికి నూతన రథం వస్తుందని, ఇందు కోసం టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు.

దేవదాయ శాఖ నిర్లక్ష్యం

ప్రతి ఏడాది మేలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ఉంటుందని తెలుసు. ఏడాది క్రితమే పాత రథం వల్ల ఇబ్బందికర పరిస్థితి ఉందని నివేదిక ఇచ్చారు. అయినా ఏడాది కాలంగా నూతన రథాన్ని నిర్మించి ఇవ్వలేకపోవడం బాధాకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా వచ్చి పరిశీలించి నూతన రథం వస్తుందని తెలిపి కూడా రెండు నెలలు గడిచి పోయాయి. కానీ ఎలాంటి రథం నిర్మించలేదు. భక్తుల మనోభావాలతో దేవదాయ శాఖ ఇంత దారుణంగా ఆడుకోవడం బాధాకరం. రథోత్సవాన్ని జరపడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఈ ఏడాది పుష్ప పల్లకిలో ఉత్సవం

ఈ ఏడాది రథోత్సవం నిర్వహించడం లేదు. కొత్త రథం ఏర్పాటుకు రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా జరిగింది. త్వరలో నూతన రథం పనులు ప్రారంభం అవుతున్నాయి. ఈ ఏడాది రథోత్సవానికి ప్రత్యామ్నాయంగా పుష్ప పల్లకి ఉత్సవం నిర్వహిస్తాం.

– శ్రీనివాసులు, ఈఓ

ఇంటి నుంచి పారిపోయి..

- పెళ్లి చేసుకున్న ప్రేమజంట

హనుమాన్‌జంక్షన్ రూరల్: నెల్లూరుకు చెందిన ప్రేమజంట హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం హల్‌చల్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరుకు చెందిన సయ్యద్ ఆఫ్రిన్ కుబ్రా, షేక్ రసూల్ ఇద్దరూ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి పరారై హనుమాన్‌జంక్షన్ చేరుకున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో ఇక్కడి బంధువులు, స్నేహితుల సహకారంతో మత పెద్దల సమక్షంలో ముస్లిం సంప్రదాయం ప్రకారం ఆదివారం ఆఫ్రిన్, రసూల్ పెళ్లి చేసుకున్నారు. ఆఫ్రిన్ అదృశ్యమైనట్లుగా ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమజంట హనుమాన్ జంక్షన్‌లో ఉన్నట్లుగా సమాచారం అందుకున్న నెల్లూరు పోలీసులు నవ దంపతులు ఉంటున్న బంధువుల ఇంటికి చేరుకున్నారు. ఆఫ్రిన్‌ను తల్లిదండ్రులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందంటూ నెల్లూరు పోలీసులతో వెళ్లేందుకు వధూవరులు అంగీకరించలేదు. దీంతో జంక్షన్ పీఎస్‌కు ప్రేమజంట చేరుకోవడంతో కొద్దిసేపు హైడ్రామా నడిచింది. తమ ఆధార్‌కార్డులు చూపించి, మేజర్లు కావడంతో ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని, తమకు రక్షణ కల్పించాలంటూ నవదంపతులు వేడుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమజంటకు.. ఇద్దరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఇంటికి పంపుతామని చెప్పడంతో ఎట్టకేలకు నెల్లూరు పోలీసుల వెళ్లిపోయారు.



ప్రేమజంట ఆఫ్రిన్, రసూల్



మూసివేసిన విజయమహల్ రైల్వే గేటు



పెన్నానది వద్ద బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జి రైల్వే పనుల కోసం మూసివేసిన గేటు



కొండాయపాళెం వద్ద మూసివేసిన రైల్వే గేటు

నరకం చూపిస్తున్న రైల్వే గేట్లు

- నగరంలో మూడు గేట్లు మూత
- వాహనదారులకు తప్పని తిప్పలు

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరం నడిబొడ్డు మీదుగా సాగే రైల్వే లైన్ ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపిస్తోంది. ఈ లైన్ నగరాన్ని రెండుగా చీల్చేసింది. అటూ, ఇటూ రాకపోకలు సాగించాలంటే రైల్వే ట్రాక్ అడ్డంగా ఉండడంతో పెన్నానది నుంచి అయ్యప్పగుడి రోడ్డు వరకు ఆరు లెవెల్ క్రాసింగ్ రైల్వే గేట్లు ఉన్నాయి. ఇందులో అయ్యప్పగుడి రోడ్డులో ఉన్న ఎల్‌సీ గేటు ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఆ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పాయి. పెన్నానది చెక్‌పోస్టు, రంగనాయకులపేట , విజయమహల్, కొండాయపాళెం, కరెంట్ ఆఫీసు సెంటర్లలో ప్రస్తుతం ఐదు లెవెల్ క్రాసింగ్ రైల్వే గేట్లు ఉన్నాయి. అయితే ప్రధానమైన విజయమహల్ గేటును ఎలాంటి మరమ్మతులు లేకపోయినప్పటికీ చాలా కాలంగా తీయడం లేదు. ఇక్కడ బాక్స్‌టైప్ బ్రిడ్జి ఉండడంతో ఈ గేట్ తీయకపోవడంతో ప్రతి నిత్యం ట్రాఫిక్‌కు గంటల కొద్ది అంతరాయం ఏర్పడుతోంది. రైల్వే ఎల్‌సీ గేటు నిర్వహణకు సిబ్బంది ఉన్నప్పటికీ బాక్స్‌టైప్ బ్రిడ్జి ఉందనే నెపంతో అసలు తెరవడం లేదని వాహన చోదకులు మండిపడుతున్నారు. ఇక్కడి గేట్ మన్లకు ఉత్తిగా జీతాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక పెన్నానదికి సమీపంలోని చెక్‌పోస్టు రైల్వేగేటు వద్ద బాక్స్‌టైప్ అండర్ బ్రిడ్జి పనుల పేరుతో దాదాపు రెండేళ్లుగా నిలిపివేశారు. ఇక్కడ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అటు వైపు వెళ్లే వాహనదారులు రంగనాయకులపేట రైల్వేగేటు వైపు, ఆత్మకూరు బస్టాండు వైపు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండాయపాళెం గేటు వద్ద ట్రాక్ మరమ్మతుల పేరుతో రోజుల తరబడి మూసివేశారు. ఈ విషయాలు తెలియక అటు వైపు వెళ్లిన వాహనచోదకులు ఉసూరుమంటూ మరో మార్గం వైపు తిరిగి వెళ్లిపోతున్నారు. కొండాయపాళెం గేటు వద్ద ఒకటి.. రెండు రోజుల్లో చేసే పనిని ఉద్దేశపూర్వకంగా రోజుల తరబడి నిలిపివేయడం, ఎలాంటి మరమ్మతులు లేకపోయినప్పటికీ విజయమహల్‌గేటును నెలల తరబడి మూతవేయడంతో నగర ప్రజలు ప్రతి నిత్యం నరకాన్ని చవిచూస్తున్నారు.

క్లుప్తంగా

అడవి పంది వధ

• ముగ్గురి అరెస్ట్



అటవీ అధికారుల అదుపులో వేటగాళ్లు

ఉదయగిరి: అడవి పందిని వధించి ఆటోలో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. నందిపాడు సమీపంలోని పొలాల్లో కాపలాదారులుగా ఉంటున్న దేవదాసు, వెంకటేష్, యాకోన్.. ఉదయగిరి మండలం వడ్లమూడిపల్లి సమీపంలోని పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేసి అడవి పందిని వేటాడి వధించారు. అనంతరం ఓ ఆటోలో నందిపాడు వైపు బయల్దేరారు. ఆ సమయంలో జాతీయ రహదారిపై వాహనాలను అటవీ శాఖ అధికారులు మురళి, ఓంప్రకాష్, ప్రసాద్, భానుతేజ తనిఖీ చేయసాగారు. ఆటోలో అడవి పంది ఉండటాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని ఉదయగిరి రేంజ్ కార్యాలయానికి తరలించారు. పశు వైద్య సిబ్బందితో పోస్టుమార్టాన్ని ఆదివారం నిర్వహించి దుర్గం అటవీ ప్రాంతంలో ఖననం చేశారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు, ఆటోను కోర్టులో సోమవారం హాజరుపర్చనున్నామని అధికారులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



నెల్లూరు(క్రైమ్): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందిన ఘటన జెడ్పీ కాలనీ మూడో వీధిలోని సైడ్ కాలువ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. తలకు గాయమై, తల, నోరు, చెవుల నుంచి రక్తస్రావమై ఉంది. మృతదేహ విషయమై దర్గామిట్ట పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాల కోసం చుట్టుపక్కల ఆరాతీశారు. జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతుడు ప్రమాదవశాత్తూ కాలువపై పడటంతో గాయపడి మృతి చెందారా.. మరే ఇతర కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

పంచాయతీలో ప్రైవేట్ వ్యక్తి పెత్తనం

• అంతా తానై నడిపిస్తున్నారనే విమర్శలు



కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి

పొదలకూరు: మేజర్ పంచాయతీ పొదలకూరులో ఓ ప్రైవేట్ వ్యక్తి పెత్తనం చేస్తున్నారనే అంశం సోషల్ మీడియాలో ఆదివారం హల్‌చల్ చేసింది. సదరు ప్రైవేట్ వ్యక్తిని సెక్రటరీ శ్రీనివాసులు రోజూ నెల్లూరు నుంచి తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయ కార్యకలాపాల్లో పాల్గొనేలా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీతో ఎలాంటి సంబంధం లేని మునికృష్ణయ్య కార్యాలయంలో కూర్చొని అధికారికంగా కార్యకలాపాలు సాగిస్తుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. సాధారణ బదిలీల్లో భాగంగా తొమ్మిది నెలల క్రితం సెక్రటరీ ఇక్కడికొచ్చారు. ఈయనకు ఇటీవలి వరకు ఈఓపీఆర్డీ ఇన్‌చార్జి బాధ్యతలనూ అప్పగించారు. అయితే వారం క్రితం మర్రిపల్లి సెక్రటరీకి ఈఓపీఆర్డీ బాధ్యతలను అప్పగించడంతో.. మేజర్ పంచాయతీ సెక్రటరీగా శ్రీనివాసులు కొనసాగుతున్నారు. ఈయన కింద నాలుగు సచివాలయాలు పనిచేస్తున్నాయి. అయితే విధులను తాను నిర్వర్తించకుండా ప్రైవేట్ వ్యక్తిని తీసుకొచ్చి సీట్లో కూర్చోబెట్టడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరుతున్నారు.

సిబ్బంది లేకే..

పంచాయతీలో సిబ్బంది లేకపోవడంతోనే సహాయంగా ప్రైవేట్ వ్యక్తిని ఏర్పాటు చేసుకున్నా. మేజర్ పంచాయతీలో పనిభారం అధికంగా ఉండటంతో ఇలా పెట్టుకోవాల్సి వచ్చింది. వివాదాలకు తావులేకుండా పనిచేస్తున్నాం. గిట్టని వారు ఇలా ప్రచారం చేస్తున్నారు.

– శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ, పొదలకూరు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 112
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 170

నిమ్మ ధరలు (పొదలకూరు)



పెద్దవి : రూ.105
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

మైపాడు.. మైమరపిస్తూ



మహా శివలింగం

సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులొచ్చినా.. స్నేహితులు కలిసినా.. సరదాగా గడపాలన్నా.. జిల్లా వాసులకు మొదట గుర్తొచ్చేది మైపాడు సాగర తీరమే. జిల్లాకు తలమానికమైన ఈ ప్రాంతం పర్యాటకులతో నిత్యం సందడిగా ఉంటోంది. మండుటెండల నుంచి ఉపశమనం పొందాలనే ఉద్దేశంతో ప్రస్తుత వేసవిలో ఎంతో మంది ఇక్కడికి వచ్చి సేద తీరుతున్నారు.

• మండుటెండల నుంచి ఉపశమనానికి పోటెత్తుతూ..
• అందుబాటులో రిసార్ట్స్

▸▸ పర్యాటకులతో నిత్యం సందడి



తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఇందుకూరుపేట: ఉరుకులు.. పరుగులతో యాంత్రిక జీవనం సాగించే ఎంతో మంది కొంత సమయం దొరికినా సేద తీరాలని భావిస్తుంటారు. ఇలాంటి వారిని మైపాడు తీరం ఆహ్వానిస్తోంది. ఇందుకూరుపేట మండలంలోని ఈ బీచ్.. బ్రిటిష్ కాలం నుంచే ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. జిల్లాతో పాటు సమీప ప్రాంతాల నుంచి ఎంతో మంది ఇక్కడికి వచ్చి సేదతీరుతున్నారు. ఇక్కడ తినుబండారాల దుకాణాలు.. గుర్రపు స్వారీ.. రిసార్ట్స్ తదితర ప్రత్యేక సదుపాయాలూ ఉన్నాయి.

బస్సు సౌకర్యమూ సొంతం

నెల్లూరు నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఉండే మైపాడు బీచ్‌కు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతి గంటకూ.. అదే మైపాడు గ్రామానికి అర్ధగంటకో బస్సు సౌకర్యం ఉంది. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే తీరానికి ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

ఆధ్యాత్మిక శోభ

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వెలసిన జ్యోతిర్లింగాలను దర్శించాలని భక్తులు కోరుకుంటారు. వీటిని ప్రతిబింబించేలా ఆలయాలను తీరంలో ప్రతిష్ఠించారు. స్వామివార్ల మూలవిరాట్టుకు ఎదురుగా నందీశ్వరుడితో పాటు ఆలయ ముఖద్వారాలకు ఎదురుగా భారీ రాతి నందీశ్వరుడి విగ్రహం ప్రత్యేకాకర్షణగా నిలుస్తోంది. ఆలయ ఆవరణలో ఉన్న 25 అడుగుల కైలాసనాథుడు, 24 అడుగుల పొడవైన పార్వతీదేవి భక్తులను కటాక్షిస్తున్నారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, ఆవరణలో ఉన్న మహాశివలింగం ఆధ్యాత్మిక శోభను కలిగిస్తోంది. తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఈ ఆలయాల్లో పూజలు చేస్తుంటారు.



మైపాడులో కొలువైన ఆలయం



రిసార్ట్స్

ఫంక్షన్లకూ స్థానం

విడిది చేసేందుకు అవసరమైన గదులు, రెస్టారెంట్ తీరంలో అందుబాటులో ఉన్నాయి. పుట్టిన రోజు, శుభకార్యాలను జరుపుకొనే వీలుంది. దీంతో ఎంతో మంది మైపాడుపై ఆకర్షితులవుతున్నారు.



రోడ్డు వెంబడి ఆహ్లాదంగా పచ్చని చెట్లు

దక్షిణ కోనసీమగా విరాజిల్లుతూ..

దక్షిణ కోనసీమగా పిలిచే ఇందుకూరుపేట మండలం కాలాలతో నిమిత్తం లేకుండా ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉంటుంది. పొలిమేర గ్రామం డేవిస్‌పేట నుంచి జగదేవిపేట, ఆదెమ్మసత్రం, మొత్తాలు, నరసాపురం గ్రామాల్లో ప్రధాన రహదారి వెంబడి ఇరువైపులా ఉండే పచ్చని చెట్లు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. ఏసీల్లో లభించని అనుభూతిని సైతం ఇక్కడ పొందవచ్చని చాలా మంది విశ్వసిస్తుంటారు. ఎంతో మంది ఇక్కడ ఆగి ప్రకృతి సోయగాలను తమ కెమెరాల్లో బంధిస్తూ.. ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతారు.

ప్రత్యేకానుభూతి



మైపాడు బీచ్‌లో సేద తీరడం ప్రత్యేకానుభూతిని కలిగిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంతో పాటు అవసరమైన వసతులు అందుబాటులో ఉన్నాయి. సమయం దొరికినప్పుడల్లా ఇక్కడికి వచ్చి సేదతీరుతుంటాం.

– శరత్‌కుమార్, తిమ్మాయిపాళెం, మర్రిపాడు మండలం

రాకపోకలకు అనువుగా ఉంటుంది



రాకపోకలు సాగించేందుకు మైపాడు బీచ్ అనువుగా ఉంటుంది. రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించొచ్చు. నెల్లూరు నగరానికి దగ్గరగా ఉండటం కూడా సానుకూలాంశం.

– కోటేశ్వరరావు, కోవూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నుజ్జునుజ్జయిన కారు



ఆస్పత్రికి క్షతగాత్రుడి తరలింపు

• మరొకరికి తీవ్ర గాయాలు

మనుబోలు: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. సైదాపురం మండలానికి చెందిన అచ్చి వెంకటరాజ, చల్లా మన్వేష్ కలిసి స్నేహితుడి కారు తీసుకొని నెల్లూరు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా హైవేపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, వెంకటరాజ అక్కడికక్కడే మృతి చెందారు. మన్వేష్ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఇరుక్కుపోయిన వీరిని స్వర్ణ టోల్‌వే సిబ్బంది వచ్చి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫామ్ హౌస్‌లో చోరీ



పొదలకూరు: రాపూరు – పొదలకూరు మార్గంలోని ఇనుకుర్తి సమీపంలో మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఫామ్ హౌస్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. పొదలకూరులో నివాసం ఉంటున్న పెంచలరెడ్డి.. ఇనుకుర్తి సమీపంలోని జామతోటలో ఫామ్ హౌస్‌ను నిర్మించారు. దీని ముందుభాగంలో మెయిన్ రోడ్డుకు సమీపంలో ఆయన బావ యానాదిరెడ్డి కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫామ్ హౌస్ గ్రిల్స్ తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి, ఇంటి తలుపు లాక్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.పది వేలను అపహరించారు. కూల్‌డ్రింక్స్ షాపు తాళాలను తెరిచి కలియతిరిగారు. అక్కడ నగదు, ఇతర సామగ్రి లేకపోవడంతో ఐస్‌క్రీమ్స్, మజ్జిగ ప్యాకెట్లను తస్కరించారు. బాధితుడు పెంచలరెడ్డి ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని ఎస్సై హనీఫ్ పరిశీలించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

వెంకటాచలం: లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన వెంకటాచలంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా, వెనుక నుంచి వస్తున్న బస్సు ఢీకొంది. ప్రమాదంలో బస్సు అద్దం పగిలిపోగా, ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆందోళనతో ప్రయాణికులు బస్సు దిగారు. కొద్దిసేపటికి వేరే బస్సులో వెళ్లిపోయారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కామాక్షమ్మా.. క్షమించమ్మా

జొన్నవాడలో సామాన్య భక్తులపై చిన్నచూపు

• గగనమవుతున్న దర్శనం
• డబ్బున్నోళ్లకే పెద్దపీట
• హారతి పళ్లేల్లో కానుకల కోసం సిబ్బంది



ఆలయ ఆవరణలో ఎక్కడపడితే అక్కడే నిలిపేసిన వాహనాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పవిత్ర పినాకినీ తీరంలో వెలసిన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దర్శనం భక్తులకు దుర్లభంగా మారుతోంది. సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నామని చెప్పే దేవదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ డబ్బున్నోళ్లు, వీఐపీలకే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దర్శనాల విభజన

జొన్నవాడ క్షేత్రానికి జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయంలో గతంలో అందరికీ ఒకే రకమైన దర్శనం ఉండేది. అయితే రాబడిని పెంచాలనే లక్ష్యంతో ప్రత్యేక దర్శనాల పేరుతో క్యూలను విభజించారు. తొలుత టికెట్ ధర రూ.25 ఉండగా, ఇప్పుడు దాన్ని రూ.50కు పెంచారు. ప్రత్యేక దర్శన భక్తులకు అమ్మవారి గర్భగుడి వాకిటి నుంచి కల్పిస్తే.. సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు మరికొద్ది దూరం నుంచే అవకాశమిచ్చేవారు.

తాజాగా ఇలా..

తాజాగా సామాన్య భక్తులకు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గర్భగుడి వద్ద క్యూలైన్‌కు గేట్‌ను ఏర్పాటు చేశారు. ఫలితంగా గర్భగుడి వాకిలికి 20 అడుగుల దూరం నుంచే అమ్మవారిని దర్శించుకోవాల్సి వస్తోంది. టికెట్ కొని వచ్చే భక్తులు అమ్మవారికి ఎదురుగా నిలుస్తుండటంతో సామాన్యులకు ఇబ్బంది ఎదురవుతోంది.

పదుల సంఖ్యలో కాంట్రాక్ట్ సిబ్బంది

ఆలయంలో పదుల సంఖ్యలో కాంట్రాక్ట్ సిబ్బందిని మోహరించడంతో భక్తులకు దేవదేవుళ్ల దర్శనం గగనమవుతోంది. హారతి పళ్లేల్లో భక్తులు సమర్పించే కానుకలను తీసి హుండీల్లో వేసేందుకు దాదాపు 70 మందిని కాంట్రాక్ట్ సిబ్బందిగా ఆలయ పాలకమండలి నియమించింది. ఆలయంలో వినాయకుడు, మల్లికార్జునస్వామి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కామాక్షితాయి అమ్మవారి సన్నిధులున్నాయి. గర్భగుడుల్లో కొలువైన స్వామివార్ల దర్శనానంతరం భక్తులు హారతి పొంది సమర్పించిన కానుకలను తీసుకునేందుకు ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది కాచుకొని ఉంటే, అమ్మవారి సన్నిధి వద్ద ఐదారుగురు ఉంటున్నారు. భక్తులకు దర్శనభాగ్యం కలగకుండా వీరు అడ్డంగా నిలబడిపోతున్నారు. పూజారులు సైతం సామాన్య భక్తులను పట్టించుకోవడంలేదనే విమర్శలూ లేకపోలేదు. ప్రత్యేక దర్శన భక్తుల వద్దకు హారతి పళ్లేలను తీసుకెళ్లి, సామాన్య భక్తుల వద్దకు రాని పరిస్థితి ఏర్పడుతోంది.

గాయపడుతున్న భక్తుల మనోభావాలు

దేవదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని జొన్నవాడ క్షేత్రంలో పరిస్థితి ఇలా ఉందని భక్తులు మండిపడుతున్నారు. మరోవైపు ఇక్కడ అనధికారకంగా పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తున్నారు. దేవదాయ శాఖతో సంబంధం లేకుండా అధికార పార్టీకి చెందిన సర్పంచ్, స్థానిక నేతలు ఇలా వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఈ విషయమై దేవదాయ శాఖ అధికారులను ప్రశ్నించగా, తమకెలాంటి సంబంధం లేదని చెప్తున్నారు. మరోవైపు పంచాయతీ తరఫున వసూలు చేస్తున్నామని నిర్వాహకులు బదులిస్తున్నారు.